www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 1 ఏప్రిల్ 2024

మండపేటలో పిఎంపిల సమావేశం

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలో పిఎంపి అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర పిఎంపి అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, రాష్ట్ర పియంపి ప్రధాన కార్యదర్శి వీటీబీ రాజులు మాట్లాడుతూ సంఘ బైలా ప్రకారం విధి విధానాల ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సంవత్సరం రాష్ట్ర కమిటీ తీర్మానం ప్రకారం ప్రతి మండలం లో క్యాన్సర్ పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమాజంలో గ్రామీణ వైద్యుల ఆవశ్యకతను గుర్తెరిగేలా ప్రాథమిక వైద్య సేవలందించాలని అన్నారు. తొలుత డాక్టర్ ఎన్ కిరణ్ కుమార్ వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిఎంపిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిఎంపి ప్రతినిధి

అరటి రైతు కంట కన్నీరు

- భారీగా పడిపోయిన ధర
- గెలకు రూ.100 కూడా రాని వైనం
- నష్టాల్లో కూరుకుపోతున్న రైతులు


అరటి గెలలను అమ్ముకునేందుకు పొలాల నుంచి రావులపాలెం మార్కెట్కు తీసుకొచ్చిన రైతులు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

పంటలు బాగా పండి దిగుబడి బాగా వచ్చి మంచి ధర పలికితే అంతకంటే రైతుకు ఆనందం ఉండదు. కాని వ్యాపారుల మాయాజాలంతో ధర ఉంటే దిగుబడి ఉండదు, దిగుబడి ఉంటే ధర లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చేసేదేమీ లేక అయినకాడికి అమ్ముకుని నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాడు అన్నదాత. కౌలు రైతుల పరిస్థితి అయితే మరి దయనీయంగా మారుతోంది. మళ్లీ పెట్టుబడి పెట్టాలంటే అప్పు దొరక్క నానా అవస్థలు పడి చివరకు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం అరటి రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.

కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు, కొత్తపేట మండలాలలో సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు వివిధ రకాల అరటి పంటలను సాగుచేస్తున్నారు. వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది మంచి దిగుబడి వచ్చింది. మంచి రేటు వస్తుందని ఆశించిన రైతులకు చివరికి కన్నీళ్లే మిగిలాయి. ఎకరాకు రూ.1.50 లక్షల వరకూ రైతులు పెట్టుబడి పెట్టారు. కౌలురైతులు రూ.60 వేల వరకూ కౌలు ఇచ్చియున్నారు. పంట బాగా పండటంతో గెలలను కోసి రావులపాలెం అరటి మార్కెట్కు తరలిస్తే గెలకుకనీసం రూ.100 కూడా రాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. గెలలను కోసి రావులపాలెం మార్కెట్కు తీసుకురావడానికి కూలి రూ.300 అవుతోంది. కనీసం కూలి రేటు కూడా రాకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికే పక్వానికి వచ్చిన గెలలు అరటి తోటల్లో గెలలు ముగ్గిపోతున్నాయి. కర్పూరం రకం అరటికి ఒడిశాలో విపరీతమైన డిమాండు ఉంటుంది. గోదావరి జిల్లాల్లో నుంచే ఎక్కువగా అక్కడికి కర్పూరరకం అరటి గెలలు ఎగుమతి అయ్యేది. అయితే ప్రస్తుతం అక్కడ కూడా కర్పూరం సాగు విస్తారంగా చేపట్టారు. అలాగే రావులపాలెం మార్కెట్ నుంచి మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాలకు అరటి ఎగుమతులు చేస్తూ ఉంటారు. ఆ రాష్ట్రాల్లోనూ అరటి సాగును చేపట్టడంతో ఎగుమతులు తగ్గాయి. అరటిని కొనుగోలు చేసే నాథులు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్లెదుటే పంట ముగ్గు పోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. గతేడాది కార్తీక మాసంలో తొమ్మిది కర్పూర గెలలకు రూ.2,500 నుంచి రూ.3వేల వరకూ ధర పలికింది. ప్రస్తుతం తొమ్మిది గెలలు సైకిలకు కట్టి పంపిస్తే రూ.3 వందలు వస్తోంది. కూలీ రూ.300 చెల్లించాల్సి వస్తుండటం, తమకు రూపాయి కూడా మిగలట్లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రావులపాలెం, అంబాజీపేట, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో అరటి మార్కెట్ యార్డులు ఏర్పాటు చేశారు. ఇక్కడ దళారీ వ్యవస్థ పెరిగిపోవడంతో గిట్టుబాటు ధర లభించట్లేదని రైతులు చెబుతున్నారు. కూలి ఖర్చులు కూడా రాకపోవడంతో పంటను మార్కెట్కు తరలించే పరిస్థితి కానరాకపోవంతో పొలాల్లోనే గెలలను వదిలేస్తున్నారు. ప్రభుత్వం స్పందించాలని, గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని అరటి రైతులు కోరుతున్నారు. లేకుంటే అప్పులు తీర్చలేక ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు.

అప్పులే మిగిలాయి



ఎకరం పొలం రూ.60 వేలకు శిస్తుకు తీసుకుని అరటిలో కర్పూర రకం వేశాను పెట్టుబడి ఇప్పటి వరకూ రూ.1.0 లక్షలు అయ్యింది. మార్కెట్టుకు తరలిస్తే గెలకు రూ.100 మాత్రమే వస్తుంది. ఆరు గెలలు తరలిచేందుకు కూలిగా రూ.300 ఇవ్వాల్సి వస్తుంది. చేతికి చిల్లిగా కూడా రావడం లేదు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాను బాకీ తీరే దారి లేదు . ఏం చేయాలో కూడా తెలియట్లేదు.

-మల్లిడి వెంకటరెడ్డి, కౌలు రైతు, రావులపాలెం

కూలి ఖర్చులు కూడా రావట్లేదు...



ఎకరం భూమిలో అరటి వేశాను. దిగుబడి బాగానే వచ్చింది. మార్కెట్ తరలిస్తుంటె కూలి ఖర్చులు కూడా సరిగా రావట్లేదు. రూ.1.50కు పైగా అప్పుచేసి పెట్టుబడి పెట్టాను. చేతికి చిల్లి గవ్వ కూడా రాలేదు.

-పెరవలి భాస్కరరావు రైతు ఆత్రేయపురం


ఆత్మీయ సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

ఎపి భవిష్యత్తు కోసమే షరతులు లేకుండా పొత్తు

ఆత్మీయ సమన్వయ సమావేశంలో పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

వైసిపి కీచక పాలన నుంచి రాష్ట్రాన్ని బయటపడేసేందుకే ఎలాంటి షరతులు లేకుండా పొత్తుకు వెళ్లామని జనసేన పార్టీ అధినేత పవన్కళ్యాణ్ అన్నారు. ఆదివారం పిఠాపురంలో కూటమి నేతల ఆత్మీయ సమన్వయ సమావేశం నిర్వహించారు. వచ్చేది కూటమి ప్రభుత్వమేనని ఆయన జోస్యం చెప్పారు. టిడిపి పిఠాపురం నియోజక వర్గ ఇన్ఛార్జ్ ఎస్విఎస్ఎన్.వర్మ, కాకినాడ లోక్ సభ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్శ్రీనివాస్, పిఠాపురం నియోజక వర్గం బిజెపి ఇన్ఛార్జ్ బి.కృష్ణంరాజు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడారు. బిజెపి పెద్దలు ఎక్కువ ఎంపీ స్థానాలు కావాలని కోరారన్నారు. దీంతో రెండు ఎంపీ స్థానాలకే పరిమితమయ్యామన్నారు. అందర్నీ కలుపుకొని వెళ్లాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. మొదట్లోనే 70 నుంచి 80 శాతం మంది అంగీకరించడంతోనే పొత్తుకు వెళ్లామన్నారు. ప్రస్తుతం జనసేన బలం పెరిగిందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే లక్ష్యంతో పొత్తులో మనమే చొరవచూపామన్నారు. బిజెపి, టిడిపి వంటి బలమైన పునాదులు, సమూహాన్ని క్రమశిక్షణతో నడిపించే మెకానిజం జనసేన పార్టీ ఇంకా సంపాదించలేదని చెప్పారు.

చంద్రబాబును జైల్లో పెట్టినప్పుడు బాధేసింది

నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేసిన టిడిపి అధినేత చంద్రబాబుని అకారణంగా జైల్లో పెట్టినప్పుడు చాలా బాధపడ్డానని పవన్ కళ్యాణ్ అన్నారు. ఆయనకే జైల్లో చంద్రబాబుని కలిసిన తరువాత తన వంతుగా ఏదైనా చేయాలని అనుకున్నానని తెలిపారు. అప్పుడే వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి ఎన్నికలకు వెళ్తాయని ప్రకటించానన్నారు. నాడు ఆశించినట్లుగానే బిజెపి కూడా పొత్తులోకి రావడం ఆనందం కలిగించిందన్నారు. అందరం కలిసి వైసిపి పాలనను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పిఠాపురంలో తన గెలుపు బాధ్యత తీసుకున్న వర్మకు కృతజ్ఞతలు తెలిపారు., గెలిచిన అనంతరం ఎట్టి పరిస్థితుల్లో ఆయన మర్యాద తగ్గకుండా, గౌరవానికి భంగం కలగకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. కూటమి తరుపున ఎంపీగా పోటీ చేస్తున్న ఉదయ్ శ్రీనివాస్కు సహకారాన్ని అందించాలని కోరారు.

పింఛన్లు అందేలా కృషి చేద్దాం

ఎన్నికల కోడ్ వల్ల పింఛన్లు ఈ నెల ఆలస్యం అయ్యే అవకాశం ఉందని, వాలంటీర్లు లేకుండా పింఛన్లు పక్కాగా పంపిణీ చేయడంలో అధికారులకు తగిన విధంగా మూడు పార్టీల నాయకులు తోడ్పాటునందించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నియమావళిని అనుసరించి తగిన విధంగా ప్రభుత్వ యంత్రాంగానికి సహాయం చేద్దామన్నారు. కూటమి ప్రభుత్వంలో ఒక్క సంక్షేమ పథకం కూడా నిలిచిపోదు అన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు చెప్పాలని సూచించారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-మండపేట


స్థానిక సప్తగిరి ఆక్సా మసీదు వద్ద అబ్దుల్ కలామ్ ఆజాద్ ట్రస్ట్ అవరణలో ఆదివారం చైర్మన్ మౌలానా పేద ముస్లింలకు నిత్యావసర కిట్ల రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ముస్లిం ఆనందంగా రంజాన్ వేడుకలు నిర్వహించుకోవాలని కోరారు. ఆకలి దప్పికల తో సాటి వారి కష్టాలు తెలుసుకొనే అవకాశం రంజాన్ ఉపవాస దీక్ష ద్వారా తెలుస్తుందన్నారు. జిల్లా నూర్ బాష్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ఒత్తిడి జయించవచ్చునన్నారు. మరో పది రోజుల్లో ఈ మాసం పూర్తి అవుతుం దన్నారు. కార్యక్రమం లో ట్రస్ట్ సెక్రటరీ షేక్ చిన్న బాదుల్లా, కార్యవర్గ సభ్యులు షేక్ మౌలాలి, షేక్ మహబూబ్ బాషా, తదిదరులు పాల్గొన్నారు.

ఎస్టియు మండల శాఖ కార్యవర్గ సమావేశం

ప్రజాశకి-మామిడికుదురు

ఎస్టియు మండల శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశం ఆదివారం మండలం పరిషత్ పాఠశాల్లో మండల శాఖ అధ్యక్షులు కారుపల్లి కళ్యాణ్ బాబు అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యాయులు సమస్యలు తో పాటు సంఘ నిర్మాణ సమస్యలు చర్చించారు. ఏప్రిల్ 8న ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామన్నారు. మండల అభయ్ కన్వీనర్గా ఉండ్రు శ్రీ రమణ ఎంపికైయ్యారన్నారు సమావేశంలో ప్రధాన కార్యదర్శి కొమ్ముల వీర రాఘవరావు, రాష్ట్ర కన్వీనర్ మట్టా నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల రమేష్బాబు, వలవల రాజా, అభయ్ కన్వీనర్ వలవల శ్రీబాలాజీ, వాణి కన్వీనర్ వడ్లమూడి రాజు, సిపిఎస్ కన్వీనర్ నేల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఎన్నికల నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా ఎస్పి ఎస్.శ్రీ ధర్

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు మరియు ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు దళాలు, జిల్లా పోలీసులు సమన్వయంగా పని చేయాలని జిల్లా ఎస్పి యస్. శ్రీ ధర్ పేర్కొన్నారు. ఆదివారం అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ లు, సమస్యాత్మక గ్రామాలలో అమలాపురం సబ్ డివిజన్ అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంకాపల్లి, బి వి ఆర్ కాలనీ, రామాలయం స్ట్రీట్, ముత్యాలమ్మ టెంపుల్ స్ట్రీట్, ఎవిఆర్ నగర్, ఎస్కెబి ఆర్ కాలేజీరోడ్డుల్లో, మల్కిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కిపురం గ్రామంలో స్థానిక పోలీసులు మరియు కేంద్ర బలగాలు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ఎన్నికల విషయమై ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకొనుటకు ప్రజలకు భరోసా కల్పించినారు.


అమలాపురంలో ఫ్లా గ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీస్ బలగాలు

పాపాజీ మాస్టారు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-రామచంద్రపురం


పాపాజీ మాస్టారు సేవలు అభినందనీయమని పలువురు ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు కొనియాడారు. విలువలతో కూడిన విద్యను అందించటం పాపాజీ మాస్టరు గొప్పతనమని వారు ప్రశంసించారు. ఆదివారం వెల్ల ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పాపాజీ మాస్టారుకు సన్మాన సభ ఏర్పాటుచేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సన్మాన సభలో వక్తలు మాట్లాడుతూ ఆయన ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దడమే కాక వారికి అభిరుచి కలిగించేలా చేశారని వ్యాఖ్యానించారు. అనంతరం ఆయనతో పాటు సతీమణి సుందరిని దుశ్శాలువాలు తోను, పూలమాలలతోనూ సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం. శ్రీనివాసు, ఉపాధ్యాయ సంఘం నాయకులు తిలక్ బాబు, చామంతి నాగేశ్వర రావు, నాగేశ్వరి, చింతాడ ప్రదీప్ కుమార్, నీలం వెంకటేశ్వరరావు, వి.సత్య నారాయణ, ఎన్ .శ్రీనివాసు, జనరల్ సెక్రటరీ ఎం .అమతరావు, వెల్ల గ్రామ కార్యదర్శి సెక్రటరీ రాయుడు మోహన్, తదితరులు పాల్గొన్నారు.


పాపాజీ మాస్టర్ దంపతులను సన్మానం

శెట్టిబలిజల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక ఏడిద రోడ్డులో ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం శెట్టి బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం ఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ బిసిలు అంటేనే టిడిపి అని అన్నారు. నియోజకవర్గంలో వైసిపి నాయకుల మాటలు వేరు చేసే పనులు వేరన్నారు. రామచంద్రపురంలో శెట్టి బలిజలను ఏవిధంగా ఇబ్బందులు పెట్టారో గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో తనను, సుభాషను ఎమ్మెల్యేలు గా గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో శెట్టిబలిజలను ఆర్థికంగా అణగదొక్కిన వైఎస్ జగన్మోహన్రెడ్డికి వచ్చే ఎన్నికల్లో శెట్టిబలిజలంతా బుద్ధి చెప్పాలని రామచంద్రపురం టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల

వేగుళ్లను భారీ మెజార్టీతో గెలిపించాలి.. పవన్ కళ్యాణ్

మండపేట ఉమ్మడి కూటమి అభ్యర్థి, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించాలని జనసేన నేత పవన్ కళ్యాణ్ కోరారు. ఆదివారం పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజక వర్గ ఇన్చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. మండపేట నియోజకవర్గం నుండి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జోగేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించేందుకు సహాయ సహకారాలు అందించాలని లీలాకృష్ణకు సముచిత స్థానం కల్పిస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. దీంతో టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

మద్యం రహిత సమాజం కోసం పాదయాత్ర

ప్రజాశక్తి-మండపేట

జన విజ్ఞాన వేదిక మద్యపాన వ్యతిరేక ప్రచార సమితి ఆధ్వర్యంలో పూర్వపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో చేపట్టిన మద్యం, మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం పాదయాత్ర ఆదివారం మండపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ మద్యపానం, మాదకద్రవ్యాలు స్వీకరించడం వలన సమాజంలో ఏర్పడుతున్న దుష్పరిమానాలు, అనారోగ్య పరిస్థితులను వివరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ యూత్ కన్వీనర్ ఉద్దండపు గుణ, కో కన్వీనర్ కె.అభిరామ్, సామాజిక కార్యకర్త విజయ వాహిని చర్ల శ్రీనివాసరెడ్డి, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు పాల్గొన్నారు.




పాల్గొన్న జెవివి నాయకులు తదితరులు

క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రామచంద్రపురం

క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైసిపి ఇన్ఛార్జి పిల్లి సూర్య ప్రకాష్ అన్నారు. పట్టణంలో శ్రీ కత్తివెంటి పేర్రాజు పంతులు గ్రౌండ్ లో క్రీడా కారులతో వైసిపి ఇన్ఛార్జి పిల్లి సూర్య ప్రకాష్ సమావేశమయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా క్రీడాకారులను వాకర్స్ అసోసియేషన్, బాస్కెట్బాల్ ఇండోర్ స్టేడియం ఆటగాళ్లను ఆయన పలకరించారు..రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి బలపరచాలని సూర్య ప్రకాష్ కోరారు. క్రీడాకారులు వాకర్స్ పెద్దలు గ్రౌండ్ లో సమస్యలను తెలియజేయగా తప్పకుండా గ్రౌండ్ని అందరికీ ఉపయోగపడేలాగా అభివృద్ధి పరుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సి పల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, శ్రీధర్ వైస్ చైర్మన్ నాగేశ్వరరావు, వార్డ్ కౌన్సిలర్ కేత సుజాత శ్రీనివాసరావు, వివిధ వార్డు కౌన్సిలర్లు, తొగరు మూర్తి, శీలం గంగరా, గుణ్ణం వెంకటేశ్వరరావు, పెంటపాటి శ్రీనివాసరావు, పోతంశెట్టి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో మాట్లాడుతున్న పిల్లి సూర్యప్రకాష్

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో ఈస్టర్ పర్వదిన్నాన్ని క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా సమాధులను వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమాధులను ప్రత్యేకంగా అలంకరించారు.

కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ను అంగర, కపిలేశ్వరపురం, తాతపూడి, నల్లూరు, వెదురుమూడి, కోరుమిల్లి, మాచర, నేలటూరు తదితర గ్రామ శివారుల్లో క్రైస్తవులు సమాధులను రంగురంగులతో తీర్చిదిద్ది, పూలతో అలంకరించారు. సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు. **మామిడికుదురు** మగటపల్లి సీయోను పార్థనామందిరం లో ఉండ్రు మోహనరావు, మోజెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించారు మామిడికుదురు, మొగలికుదురు, నగరం, అప్పనపల్లి, పాశర్లపూడి, లూటుకుర్రు, గోగనమఠం తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థన లు చేశారు. **మండపేట** మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈస్టర్ పర్వదినాన్ని జరుపుకున్నారు. పలు చర్చిలలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చ్ ఫాదర్స్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పుట్టిన రోజయిన క్రిస్మస్ తరువాత అంతటి ప్రాముఖ్యత ఈస్టర్ పండుగకు ఉంది. ఈస్టర్ పండుగకు ముందు 40 రోజుల పాటు క్రైస్తవులు ఉపవాసం ఆచరించడం వందలాది ఏళ్లుగా ఆచారంగా వస్తోందని ఆ ఉపవాసాలు ఈస్టర్ పర్వదినం రోజు ముగుస్తాయి. ఈ నలభై రోజులు తాము ఉపవాసం ఉండి పొదుపు చేసిన ఆహార పదార్థాలు, నగదును పేదలకు ఈస్టర్ పర్వదినం నాడు భక్తిపూర్వకంగా క్రైస్తవులు దానమిస్తారని పలువురు క్రైస్తవుల తెలిపారు. ఈ పండుగను పురస్కరించుకుని అన్ని చర్చిలను అందంగా తీర్చిదిద్దారు.


తాతపూడి లో పువ్వులతో అలంకరించిన సమాధులు

తెలంగాణ సిఎంను కలిసిన స్పర్జన్ కింగ్

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు మండలానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు టి.స్పర్జన్ కింగ్ ఆదివారం తెలంగాణ రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈస్టర్ సందర్భంగా ముఖ్య మంత్రికి క్రైస్తవ గ్రంథాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ధి కింగ్ ఫౌండేషన్, గాడ్స్ వే ఫౌండేషన్ ద్వారా కోవిడ్ సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో చేసిన సేవలపై ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రిగా రేవంత్రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తెలంగాణ లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంపై స్పర్జన్ కింగ్ హర్షం వ్యక్తం చేశారు.


సిఎం రేవంత్రెడ్డితో స్పర్జన్ కింగ్

వైసిపి నుంచి టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-యంత్రాంగం

పలువురు వైసిపి కార్యకర్తలు ఆదివార టిడిపిలో చేరారు. వీరికి టిడిపి నాయకులు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ముమ్మిడివరం మండలంలో కొత్తలంక గ్రామానికి చెందిన పలువురు వైసిపి నుంచి నియోజకవర్గ టిడిపిలో చేరారు ఐ.పోలవరం మండలం మురమళ్ళ క్యాంపు కార్యాలయంలో టిడిపి ఉమ్మడి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన గుత్తుల మల్లికార్జునరావు, శీలం వెంకట రమణ, పొత్తూరి సూర్యనారాయణ రాజు, బుర్రా మోషేను ముదునూరి శ్రీరామరాజు, గుత్తుల భాస్కరరావు, మెండూరి బుజ్జి లకు సుబ్బరాజు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, అర్ధాని శ్రీనివాసరావు, గీసాల చంద్రరావు, సామంతకుర్తి సుబ్బారావు విత్తనాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు **కాట్రేనికోన** పంచాయతీ పరిధిలో తిమ్మాపురం కొత్త రామాలయం వీధి నుంచి 30 మంది వైసిపి కార్యకర్తలు టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. వీరందరికీ బుచ్చిబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సంసాని రామకృష్ణ ఆధ్వర్యంలో వీరి చేరికలు జరిగాయి. కార్య క్రమంలో నాగిడి నాగేశ్వరరావు, నడుంపల్లి సుబ్బరాజు, విత్తనాల శ్రీనివాసరావు, విత్తనాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.5లక్షల విరాళం

ప్రజాశక్తి ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన కొవ్వూరి శివ శంకర రెడ్డి, పద్మ దంపతులు రూ.5 లక్షల117 ఆదివారం ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్కుమార్కు అందజేశారు . వీరికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటం అందజేశారు


దాతకు స్వామివారి చిత్రపటం అందజేత

నేరాలు ఘోరాలు



గేటు మీద పడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎడిబి రోడ్డులోని యాంగ్లీయాన్ కోల్డ్ స్టోరేజ్ కంపెనీకి చెందిన గేటును తరలించే క్రమంలో ఒక కార్మికుడు మృతి చెందాడు. తుని మండలం తేటగుంటకు చెందిన సన్నిబోయిన బోడియ్య(55) ఎడిబి రోడ్డు విస్తరణ పనుల్లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోడ్డు పని ముగించుకున్న తరువాత కోల్డ్ స్టోరేజ్ ఫ్యాక్టరీ గేటు పెట్టే పనికి వెళ్లాడు. అధిక బరువున్న గేటును తరలించే క్రమంలో ఆ గేటు కార్మికుడిపై పడింది. దీంతో ఆ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం తెలుసుకున్న కార్మికుడి బంధువులు కంపెనీ వద్దకు చేరుకుని న్యాయం చేయాలంటూ ఆందోళన చేశారు. ఈ ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న ఎఎస్ఐ సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. కార్మికుడి మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి

కార్మికుడు బోడియ్య మృతికి కోల్డ్ స్టోరేజ్ కంపెనీ యాజమాన్యం బాధ్యత వహించి మృతిని కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు మండల అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు డిమాండ్ చేశారు. మిషన్లతో పెట్టించాల్సిన 30 అడుగుల గేటును కార్మికులతో పెట్టించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, కార్మికుడి మృతికి కంపెనీ యాజమాన్యం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై రెవెన్యూ, కార్మిక శాఖ అధికారులు స్పందించి వర్క్‌మెన్ కాంపెన్సేషన్ యాక్ట్ రపకారం కార్మిక కుటుంబానికి నష్ట పరిహారాన్ని ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

మల్లేపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున మహిళ మెడలో బంగారపు పుస్తెల తాడు చోరీపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. గండేపల్లి మండలం మల్లేపల్లికి చెందిన పోతు చెల్లారావు, తన భార్య మంగయమ్మతో కలిసి ఉంటున్నారు. మంగయమ్మ పుట్టుకతో మూగ. ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో భార్యాభర్తలిద్దరూ నిద్రలేచి ఇంటి బయట ఉన్నారు. ఈ సమయంలో ముగ్గురు వ్యక్తులు ఒక బైకుపై వచ్చారు. బహిర్భూమికి వెళ్తున్న మంగయమ్మ మెడలో రెండు కాసుల బంగారు పుస్తెలతాడు లాక్కొని పరారయ్యారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వాదాలకుంట గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకుని కేసు నమోదు చేశామని, రూ.4,020 నగదు సీజ్ చేసి, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు.



నిర్మానుష్యంగా రామచంద్రపురం ద్రాక్షారామ మెయిన్ రోడ్డు

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణతాపంతో రోడ్లన్నీ కర్ఫ్యూను తలపిస్తున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు గంటల వరకు జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా తయారవుతున్నాయి. ఏడాది ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఇక ఏప్రిల్ మే నెలలో మరింతగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. ఎండ వేడికి తాళలేక పలువురు ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు.

పింఛన్లు సకాలంలో అందేటట్లు చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-అమలాపురం

పింఛన్లను సకాలంలో అందేటట్లు ఎన్నికల కమిషన్ తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల షెడ్యూలు నేపథ్యంలో వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ నిలిపివేయడం వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సకాలంలో వృద్ధులు, మహిళలు, వికలాంగులకు పెన్షన్లు అందించాలని అన్నారు. ఇందుకు గ్రామ, వార్డు సచివాలయం, రెవెన్యూ ఉద్యోగుల సేవలను ఉపయోగించుకొని గతంలో లాగానే నేరుగా పింఛను దారులకు పెన్షన్ అందించాలన్నారు. సచివాలయాలు దూరంగా ఉన్నచోట దగ్గరలో ఉండే పంచాయతీ కార్యాలయాలు, సిబ్బందిని కూడా దీనికి ఉపయోగించుకోవాలన్నారు.

సాకావారిపేటలో వీరభద్ర సంబరం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి సాకావారిపేటలో ఆలయం వద్ద ఆదివారం వీరభద్ర స్వామి సంబరం ఘనంగా నిర్వహించారు. అనంతరం పిల్లి నాగరాజు మంగ దంపతులు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

విద్య, ఉపాధి కోసం పోరాడుదాం...

ప్రజాశక్తి - కాకినాడ

అందరికీ విద్యా ఉపాధికై పోరాడు దామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పిలుపు నిచ్చారు. స్థానిక యుటిఎఫ్ హోంలో భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా విద్యా వైద్యానికి శిక్షణ తరగతుల్లో భాగంగా చివరిరోజు ఆదివారం జరిగిన తరగతుల్లో 'ఎస్ఎఫ్ఐ విశిష్టత-సంఘ నిర్మాణం' అనే అంశంపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ. అశోక్ మాట్లా డారు. అందరికీ విద్యా ఉపాధి కోసం ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, నాయకులు పోరాడాలని పిలుపునిచ్చారు. నేడు నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించడంలో దేశంలోనే ఎస్ఎఫ్ఐ అగ్రభాగాన ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నాయని అన్నారు. నూతన జాతియ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, అందరికీ ఉచితంగా విద్యను అందించాలని మెరుగైన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రభుత్వ శాకల్లో ఖాళీగా ఉన్నా ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ విద్యా ఉపాధి కోసం భారత్ విద్యార్థి ప్రదర్శన ఎస్ఎఫ్ఐ సమరసిల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వరహాల అధ్యక్షతన జరిగిన 'కులం, కుల సమస్యలు' అనే పాఠంపై సిఐటియు జిల్లా అధ్య క్షులు దువ్వా శేషాబాబ్జీ బోధించారు. ఈ కార్య క్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు వాసు, సంజయ్, గోపాలు, సిద్ధు, లోవరాజు, రాజేష్, వంశి, భాస్కర్, కరుణ అమత, సుష్మదేవి, భువన పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

అప్నా అధ్యక్షునిగా కల్యాణ చక్రవర్తి

ప్రజాశక్తి - కాకినాడ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(ఆప్నా) రాష్ట్ర అధ్యక్షుడిగా ట్రస్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వై.కళ్యాణ చక్రవర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఐఎంఎ అసోసి యేషన్ హాలులో ఆదివారం జరిగిన అప్నా 10వ వార్షిక సమావేశంలో ఆయనను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రయివేటు హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్ అసోసియేషన్ సమస్యలు పరిష్కా రానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలంటే ప్రభుత్వ సహకారం ఎంతో అవసరమని, కోవిడ్ సమయంలో ప్రజలకు ఎంతో సేవలు అందించామన్నారు. అనేక సమస్యలు వలన సుమారు 2500 హాస్పి టల్స్ మూతపడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన వైద్య నిపుణులకు వైద్య శాస్త్రంలో చోటుచేసు కుంటున్న నూతన విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పివి.మధుసూదన్ శర్మ, డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ పి.ఆదినారాయణ, డిఎంహెచ్ఓ డాక్టర్ జె.నరసిం హనాయక్ పాల్గొ న్నారు. కళ్యాణ్ చక్రవర్తిని పలువురు అభినందించి సత్కరించారు.

పింఛన్ల పంపిణీలో రాజకీయాలు సరికాదు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వం ద్వారా అందించే పింఛన్ల పంపిణీలో రాజకీయాలు చేయడం సరికాదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ప్రభుత్వ వ్యవస్థల్ని నిర్లక్ష్యం చేసి వాలంటీర్లతో ప్రభుత్వ కార్యకలాపాలు చేపట్టడం వల్లనే నేడు పింఛన్‌దారులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సివస్తుందని అన్నారు. గత అయిదేళ్లుగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు నెలవారీ అందించే పింఛన్ల బాధ్యతల నుంచి ప్రభుత్వం ఉద్యోగులను దూరం చేయడం వల్లే ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. రాజకీయ స్వలాభం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానం వల్ల నేడు పింఛన్‌దారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు ప్రభుత్వ ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేసి భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వంపై ఉందన్నారు.



ఎన్నికల ప్రచారంలో వంగా గీత, పెండెం దొరబాబు

చేబ్రోలు సభలో పవన్ వ్యాఖ్యలు సరికావు

ప్రజాశక్తి - పిఠాపురం

చెబ్రోలు సభలో పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు సరికావని వైసిపి అసెంబ్లీ అభ్యర్థి, ఎంపీ వంగా గీత అన్నారు. పట్టణంలో స్థానిక 27, 28 వార్డులో ఎంఎల్ఎ పెండెం దొరబాబుతో కలిసి ఆమె ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో మహిళలు హారతులతో ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం గీత మీడియాతో మాట్లాడారు. పవన్ నియోజకవర్గంలో మత విద్వేషాలు జరిగాయన్నారు. కాని నియోజవర్గంలో ప్రజలందరూ అన్నదమ్ములగా కలిసి మెలిసి ఉంటున్నారని ఆమె తెలిపారు. పిఠాపురానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. బషీర్ బేబీ దర్గాను లక్షలాదిమంది మతాలకతీతంగా దర్శించుకుంటారని, శివరాత్రికి పాదగయకు లక్షలాదిమంది సుదూర ప్రాంతాల నుంచి వస్తారని తెలిపారు. ఏనాడు కూడా అవాంఛనీయ సంఘటనలు ఏమి జరగలేదన్నారు. డబ్బులు పంచుతున్నారు, డబ్బులు ఉన్నాయంటు యువతను రెచ్చగొడుతున్నారని, ఇటువంటి అబద్ధాలను ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. ఎజెండాని ప్రచారం చేసుకోవాలని ప్రజలకు ఏమి చేయాలనుకుంటున్నారో తెలపాలన్నారు. ఎవరు గెలవాలో ఎవరికి ఎంత మెజార్టీ ఇవ్వాలో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. రాజకీయాల కోసం ప్రజలను రెచ్చగొట్టడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో గుండేపల్లి బాబి, బాలిపల్లి రాంబాబు, తలిశెట్టి వేంకటేశ్వరరావు, నాగ మల్లీశ్వరి, ముమ్మిడి శ్రీను, బొజ్జ పెద్దకాపు, బొజ్జ దొరబాబు, సయ్యద్ మోహిద్దీన్, చింతడా నీలవేణి, రాయపురెడ్డి పావని, నాయకులు, కార్యకర్తలు పాల్గున్నారు

యానాం వార్తలు



క్యాథలిక్ చర్చి వద్ద కొవ్వొత్తులతో ఆరాధన చేస్తున్న క్రైస్తవులు

ఘనంగా ఈస్టర్ ఆరాధన

ప్రజాశక్తి - యానాం

యానాం రోమన్ క్యాథలిక్ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. క్రీస్తు పునరుద్ధానం చెందిన రోజును పురస్కరించుకుని ఫాదర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యానాం, పరిసర ప్రాంతాల నుంచి క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

సెక్టార్ ఆఫీసర్లకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న సెక్టార్ అధికారులు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లోక్ సభ స్థానానికి ఏప్రిల్ 19న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో యానాంలోని ఆయా సెక్టార్ ఆఫీసర్లుకు, అసిస్టెంట్ సెక్టార్ ఆఫీసర్లకు రెండో విడత శిక్షణా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్థానిక సర్వశిక్ష అభియాన్ సమావేశపు హాల్‌లో స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పరిపాలనాధికారి ఆర్.మునుస్వామి సెక్టార్ అధికారులు నిర్వహించాల్సిన ఎన్నికల విధులకు సంబంధించిన పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆయా సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకట్రావు

కౌంటింగ్ కేంద్రం సందర్శన

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకట్రావు జెఎన్‌టియుకె సివిల్ బ్లాక్ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రా లను ఆదివారం సందర్శిం చారు. మౌలిక వసతులను పరిశీలించారు. అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎలక్షన్ డిటి సీతాపతిరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఓటింగ్ శాతం పెంపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

గ్రామీణ, పట్టణ ప్రాంతా ల్లో ఓటింగ్ శాతం పెంపునకు ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటన ద్వారా కోరారు.ఓటు అంటే ప్రజాస్వామ్య వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడే గొప్ప వజ్రాయుధమనే విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కునేందుకు ముందుకు రావా లని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడి,దేశ భవిష్యత్తు ను నిర్దేశించేది ఓటు హక్కేనన్నారు. ఈ అంశాన్ని ప్రజలు గుర్తించాల్సిన ఆవసరం ఎంతగానో ఉందన్నారు. విద్యా సంస్థల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ వినూ త్నంగా ఓటరు జాగతి కార్యక్రమా లు నిర్వహిస్తామన్నారు.. ప్రస్తుత ఎన్నికల్లో సగటున ఓటింగ్ 85 శాతానికి పెంచాలనే లక్ష్యంతో కషిచేస్తుస్తున్నామని వెల్లడించారు. ప్రలోభాలు లేని వాతావరణంలో నైతిక ఓటింగ్ ద్వారా ప్రజాస్వామ్యవ్యవస్థ బలోపేతమవుతందని పేర్కొన్నారు. ఓటు హక్కు అమూల్యమైనదని ఎంతో మంది త్యాగాలు, ఎన్నో విప్లవాలు, పోరాటాల ఫలితంగా అత్యున్నత ప్రజాస్వామ్యం మనకు లభించిందన్నారు. దీన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కషి చేయా ల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఓటు హక్కు వినియోగించు కోవడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమా లు ద్వారా గత ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయని. అందువల్ల ఈ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం కొనసాగిస్తున్నట్లు వివరించారు. మే 13 న నిర్వహించే పోలింగ్లో అందరూ ఓటు వేసి ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. పట్టణ ప్రాంతాలలో ఓటింగ్ పై ఆసక్తి తగ్గి ఓటింగ్ శాతం తక్కువగా ఉంటున్న నేపథ్యంలో ఓటింగ్ శాతం పెంపొందించే దిశగా ఓటుహక్కు వినియోగం ఆవశ్యకత గురించి యువత, పట్టణ ప్రాంతాల్లో వచ్చే సాధారణ ఎన్నికల్లో అందరూ ముందుకు వచ్చి ఓటుహక్కును వినియోగించుకో వాలని విజ్ఞప్తి చేశారు. నూతనంగా నమోదైన యువత ఓటు విలువ తెలుసుకొని, దాన్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వా ములు కావాలని తెలిపారు. ప్రపం చంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన మనదేశంలో సార్వత్రిక ఎన్నికలు ఒక పెద్ద పండుగ వంటివ ని, ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులైన వికలాంగులకు 'ఫ్రెండ్లీ ఓటింగ్' రానున్న సార్వత్రిక ఎన్నికలలో స్నేహపూర్వక వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా జిల్లాలో అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వికలాంగుల సౌకర్యార్థం ర్యాంపులు సక్రమంగా ఉంచామన్నారు అవ సరమైన చోట వికలాంగులకు వీల్ చైర్లను అందు బాటులో ఉంచామన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ డెస్క్, బ్రెయిలీ బ్యాలెట్ షీట్, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుతో పాటు సహాయకుడిని ఉంచేలా ఏర్పాట్లు చేపట్టామన్నారు. 85 ఏళ్ల పైబడిన వారికి, నడవలేని స్థితిలో ఉన్న వికలాంగులకు హోం ఓటింగ్, భారత ఎన్నికల సంఘం రూపొం దించిన సెక్ష్యమ్ యాప్ వినియోగంపై ఎన్నికల విధుల్లో ఉన్న అధికా రులు, బూత్ లెవెల్ అధికారులు అవగాహన కల్పించాల ని సూచించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన నిబంధనలకు అనుగుణ ంగా వికలాంగులు తమ యొక్క ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నా రు.



కలెక్టర్ హిమాన్షు శుక్లా

హోమ్ ఓటింగ్‌పై ప్రత్యేక కార్యాచరణ

రాజమహేంద్రవరం రూరల్ రిటర్నింగ్ అధికారి తేజ్‌భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో హోమ్ ఓటింగ్‌పై ప్రత్యేక కార్యచరణను సిద్ధం చేసుకుని అమలు చేయాలని రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ స్పష్టం చేశారు. ఆదివారం జెసి ఛాంబర్‌లో రాజమహేంద్రవరం రూరల్ సెక్టార్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో ఇంటి ఓటింగ్‌పై సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రూరల్ తేజ్ భరత్ మాట్లాడారు. ఎన్నికల్లో ఓటింగు శాతం పెరిగేలా ఎన్నికల కమీషన్ తీసుకున్న చర్యల్లో భాగంగా 85 ఏళ్ళ నిండిన ఓటర్లు, 40 శాతం పైబడిన వికలాంగ ఓటర్ల ఐచ్ఛికం మేరకు 12 డి ఫారం ద్వారా అంగీకారం తెలిపిన వారికి ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే నియోజక వర్గ పరిధిలోని 267 పోలింగ్ కేంద్రాల్లో 85 ఏళ్ళ నిండిన 1,191 ఓటర్లు, 40 శాతం పైబడిన వికలాంగ ఓటర్లు 2,439 ఉన్నట్లు గుర్తించామన్నారు. పోలింగు కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. పోలింగు కేంద్రానికి రాలేని వారి నుంచి 12డి ఫారం ద్వారా అంగీకారం పత్రం తీసుకుని ఆమేరకు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియలో సెక్టార్ అధికారులు, సూపర్ వైజర్స్, బిఎల్ఓలు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఐ.సాయిబాబు, సహాయ రిటర్నింగ్ అధికారులు, తహశీల్దార్లు వైకెవి.అప్పారావు, బి.రమాదేవి, సెక్టార్ అధికారులు, సూపర్ వైజర్లు, బిఎల్ఓలు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి తేజ్‌భరత్

బిలాల్ మసీదులో ఘనంగా ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అల్లా కృప అందరిపైనా ఉండాలని రాజమహేంద్రవరం ఎంపీ, వైసిపి రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా నగరంలోని రాజేంద్రనగర్ బిలాల్ మసీదులో ఆదివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిములు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజంతా కఠోర ఉపవాసం చేయడం అనేది మహా యజ్ఞమే అన్నారు. అల్లా చెప్పిన విధంగా తోటి వారిపై ప్రేమ, దయ, జాలి, కరుణ చూపిస్తూ, తోచిన సహాయ సహకారాలు చేయడం అభినందనీయమన్నారు. అల్లా సంపూర్ణ ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఈ సందర్భంగా ఎంపీ భరత్ ఆకాంక్షించారు.

నవోదయకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఇటీవల జరిగిన నవోదయ ఎంట్రన్స్ పరీక్షలో కె.గంగవరం మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఇఒనాగరాజు ఆదివారం తెలిపారు. వట్రపూడి గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల నుంచి విద్యా ర్థిని మానుపూడి సుదీప్తి, కోటిపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి విద్యార్థి గాలి దుర్గా హర్షవర్ధన్ ఎంపికయ్యారు. విద్యార్థులను ఎంఇఒ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఆలమూరు

O.S. No. 26/2022

Between:

State Bank of India, Chemudulanka Branch, Rep. by its Manager, Chemudulanka, Alamuru Mandal, Alamuru ***...Plaintiff***

AND

Gurrala Manikanteswari and Others ***...Defendants***

D-2: Dasari Abbayi, S/o. Veerraju, Hindu, aged 55 years, Agriculture, D.No. 3-10, Near Chintalamma Temple, Pottilanka, Kadiam Mandal. **...2nd Defendant**

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 25-4-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 1-4-2024 **ఎం.రఘునాథ్** అడ్వకేట్, రాజమండ్రి

ప్రకటన

మహారాజ శ్రీ నిడదవోలు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.41/2023 in OS No.174/2022

Between :

గుమ్మడి భీమారావు -DHr/వాది

And

తిరుమళ్ళ రంజిత్ కుమార్ -JDr/ప్రతివాది

To,

తిరుమళ్ళ రంజిత్ కుమార్ S/o **గౌతు మునేశ్వర రావు,** D.No.2-34, పోస్టాఫీసు వీధి, అట్లపాడు, నిడదవోలు మండలం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు E.P. లో మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు E.P. మీ హాజరు నిమిత్తం **ది.12-04-2024 తేదికి వాయిదా అయి ఉన్నది.** కనుక ఆ రోజు **ఉదయం 10.30 లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీ తరుపున సమాధానం దాఖలు చేసుకోవలయును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది.

వాయిదా తేది. 12-04-2024.

ఏలూరి గోపాల కృష్ణ, B.Com.BL.,
ఫణితిన వీరాంజనేయ చౌదరి, B.Com.BL.,
అడ్వకేట్స్, నిడదవోలు,

తేది : 01.04.2024 సెల్ : 93932 24546.

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

H.M.O.P. No. 182/2023

Between:

Vechha (Batchu) Nukaratnam, W/o. Kasi Viswanadham, D/o. Batchu Satyanarayana Murthy, Hindu, aged 40 years, House Wife, Near Panchayathi, Veeravaram Village, Kadiyam Mandal, East Godavari District. ***...Petitioner***

AND

Vechha Kasi Viswanadham, S/o. Satyanarayana @ Bullabbai, HIndu, aged 43 years, Business, Near Panchayathi, Duddukuru Village, Devarapalli Mandal, West Godavari District.

...Respondent

పై నెంబరు పిటిషన్‌లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 26-4-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 1-4-2024 **సిహెచ్.ఎస్.కె.వి.సూర్యప్రభ** అడ్వకేట్, రాజమండ్రి

గ్రామపంచాయతీ కార్యాలయం, నడిపూడి

టెండరు ప్రకటన

రి.క. నెం.10/2024 తేది.26-03-2024

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం, నడిపూడి గ్రామపంచాయతీ 2024-2025 సంవత్సరమునకు అవసరమగు ఈ దిగువ చూపిన ఐటెం తాలూకు వివిధ విడిభాగములు మరియు మందులు సరఫరా చేయుటకును మరియు వివిధ సేవలు నిమిత్తం సీలు వేసిన టెండర్లు ఈ దిగువ సంతకపు అధికారి వారిచే గాని, వారి అనుమతి పొందిన మరియొకరిచే గాని ది. 2-04-2024వ తేదీ మధ్యాహ్నం గం॥ 12.00 లకు వరకు తీసుకొని అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో మధ్యాహ్నం గం॥ 12.30లకు సదరు టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయం పని వేళలలో తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరములు	ధరావత్తు (రూ)
1	2024-2025 సంవత్సరమునకు అవసరమగు ప్రజారోగ్య పనిముట్లు, మందులు సరఫరా చేయుటకు	రూ. 500/-
2	2024-2025 సంవత్సరమునకు అవసరమగు మంచినీటి సరఫరా విడిభాగములు సరఫరా చేయుటకు	రూ. 500/-
3	2024-2025 సంవత్సరమునకు అవసరమగు స్టేషనరి సామానులు సరఫరా చేయుటకు	రూ. 500/-

సం/- **చెల్లుబోయిన వెంకటేశ్వరరావు**, సర్పంచ్, నడిపూడి గ్రామపంచాయతీ
సం/- శ్రీమతి **బి.ఎ.ఎస్.లక్ష్మి**, పంచాయితీ కార్యదర్శి, నడిపూడి గ్రామపంచాయతీ

గమనిక: 1. గ్రామపంచాయితీ నిధులు నిల్వలను అనుసరించి బిల్లులను వరుస క్రమములో చెల్లించబడును.
2. గ్రామపంచాయితీనకు సరఫరా చేయబడు సామాన్లు మంచి నాణ్యత కలిగి ISI మార్కు కలిగి యుండవలెను.
3. టెండరును ఆమోదించుట గాని, నిరాకరించుటకు గాని పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.